## క్లుప్తంగా

### పదో తరగతి మోడల్ పరీక్ష విజయవంతం



మోడల్ పరీక్ష ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ సభ్యులు

**చీమకుర్తి:** ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో చీమకుర్తిలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీలో ఆదివారం నిర్వహించిన పదో తరగతి మోడల్ పరీక్ష విజయవంతమైందని ఆ సంఘ నాయకులు దేవరాజు, అక్బర్ తెలిపారు. పట్టణంలోని పది పాఠశాలల నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 150 మంది హాజరైనట్లు చెప్పారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు ఈ మోడల్ పరీక్ష ఉపయోగపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

### పూర్తయిన రాచవారి పాలెం రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

**మద్దిపాడు:** మండలంలోని గుండ్లాపల్లి సత్రం సెంటర్ నుంచి రాచవారిపాలెం వెళ్లే రహదారి నిర్మాణం ఆదివారం పూర్తయింది. ఒకటిన్నర సంవత్సరం నుంచి రాచవారిపాలెం రహదారి నిర్మాణానికి ఇబ్బందులు ఎదురైన నేపథ్యంలో గాజులపాలెం, కీర్తిపాడు, రాచవారిపాలెం ప్రజలు అవస్థ పడుతున్నారు. ఈ నేపథ్యంలో 90 లక్షల రూపాయల విలువైన రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్ చింతా శ్రీనివాసరెడ్డి పూనుకుని శని, ఆదివారాల్లో రెండు కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. జాతీయ రహదారికి చేరుకోవడానికి మూడు గ్రామాల ప్రజలకు ఉన్న ఇబ్బంది తొలగిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ కాంట్రాక్టర్‌కు అభినందనలు తెలిపారు.

### కొప్పరపాడుకు నూతన పీహెచ్‌సీ మంజూరు

**బల్లికురవ:** మండలంలోని కొప్పరపాడు గ్రామానికి ప్రభుత్వం నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసిందని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహ్మద్ ఆదివారం తెలిపారు. ప్రస్తుతం మండలంలోని 20 సచివాలయాలతో పాటు, మార్టూరు మండలంలోని వలపర్ల ఒకటి, రెండు సచివాలయాలు కూడా గుంటుపల్లి పీహెచ్‌సీ పరిధిలోనే ఉన్నాయన్నారు. ప్రజలకు అందుబాటులో వైద్యం అనే విధంగా కొప్పరపాడు పీహెచ్‌సీని మంజూరు చేశారని చెప్పారు. పది సచివాలయాల్లోని ప్రజలతోపాటు మేదరమెట్ల, నార్కెట్‌పల్లి నామ్ రహదారిలో ప్రమాదాలు సంభవించిన సమయంలో కొప్పరపాడు పీహెచ్‌సీలో అత్యవసర చికిత్స అందించనున్నట్లు వైద్యాధికారి చెప్పారు.

### ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవాలి

**చీరాల రూరల్:** చిన్నారులకు చిన్ననాటి నుంచి చదువుతో పాటు ఆధ్యాత్మిక చింతన అలవరచుకున్నట్లయితే మంచి పౌరులుగా ఎదుగుతారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జాన్‌పేటలోని సెయింట్ జాన్స్ ప్యారిష్ చర్చిలో సండే స్కూలు చిన్నారులకు చిల్డ్రన్స్ రీట్రీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బైబిల్ గ్రంథంలోని అంశాలను క్రోడీకరించి క్విజ్ పోటీలు, దేవుని గీతాలాపన పోటీలు నిర్వహించారు. విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముందుగా సంఘ కాపరి రెవరెండ్ గోదా చంద్రకాంత్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దేవుడి వాక్య సందేశాలు అందించారు. చిన్నారులను క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం చర్చిలో జరిగే సండే స్కూలు కార్యక్రమాలకు పంపించి దేవుని సన్నిధిలో మంచి పౌరులుగా ఎదిగేలా పెద్దలు, తల్లిదండ్రులు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సండేస్కూలు ప్రతినిధులు, టీచర్లు, చిన్నారులు పాల్గొన్నారు.



ఏపుగా ఎదిగిన మిర్చి



పూత, పిందె దశలో ఉన్న శనగ



కోతకు వచ్చిన జొన్న



జూట్ పంట

# పంట పండింది..!

- మండలంలో పంటలతో కళకళలాడుతున్న పొలాలు
- ఆశాజనకంగా దిగుబడులు
- లాభాలు వస్తాయని ఆశిస్తున్న రైతులు

**ఒంగోలు రూరల్:** మండలంలోని గ్రామాల్లో రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలు ప్రస్తుతం ఏపుగా ఎదిగి పచ్చగా కళకళలాడుతున్నాయి. దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉండటంతో గిట్టుబాటు ధరలు లభించి లాభాలు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. రాష్ట్రంలో గత మూడేళ్లుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయం ముమ్మరంగా సాగుతోంది. నేలల్లో తేమ శాతం అధికమై పంటల ఎదుగుదలతో రైతులకు మంచి దిగుబడులు కూడా వస్తున్నాయి. ప్రధానంగా మెట్ట పంటలు కేవలం భూమిలో ఉండే నీటి శాతం, గాలిలో ఉండే తేమ శాతంతోనే ఎదుగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం ట్యాంకర్ల ద్వారా సమీప చెరువులు, గుండ్లకమ్మ నది నుంచి నీరు తీసుకొచ్చి పైపులు, కాలువల ద్వారా ఆయా పంటలకు అందించాల్సి వచ్చేది. ప్రస్తుతం మూడేళ్లుగా సమృద్ధిగా సకాలంలో వర్షాలు కురుస్తుండటంతో పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కూడా కురుస్తుండటంతో భూగర్భ జల మట్టం పెరిగింది. దీంతో మెట్ట పంటలు వేసినా.. మాగాణి పంటలు వేసినా మంచి ఫల సాయాన్ని అందిస్తున్నాయి. మండలంలోని గ్రామాల్లో విస్తారంగా సాగుచేస్తున్న జామాయిల్, సుబాబుల్, సరివి తోటలు మంచి ఎదుగుదలతో పాటు కాండం మంచి లావు కలిగి కాటాల్లో బరువును అందిస్తోంది. ఫలితంగా రైతులకు టన్నేజ్ వస్తోంది. ఇదిలా ఉండగా, మండలంలో సాగుచేసిన జొన్న, మినుము, మిర్చి, జూట్ పంటలు మంచి దిగుబడులు అందించే దశలో ఉన్నాయి. మిర్చి కాపు దశలో ఉండగా, జొన్న ప్రస్తుతం కోత దశలో ఉంది. శనగ జేజీ11, కాక్2 రకాలు వందలాది ఎకరాల్లో వేసిన తర్వాత భారీ వర్షాలు వచ్చినా తిరిగి అవే రకాలు వేయడంతో ప్రస్తుతం పూత, గింజ దశలో ఉన్నాయి.

ఈసారి ఎలాంటి అవాంతరాలు రాని పక్షంలో శనగ రైతులు లాభాల దిశలో ఉన్నారు. జనుము, జామ, మిర్చి వేసిన రైతులు కూడా మంచి లాభాలు గడించారు. ఇందుకు ప్రధాన కారణం ప్రతి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం ద్వారా సిబ్బంది, ఒంగోలు మండల ఏవో కిషోర్‌బాబు రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు రైతు పరిశోధన సంస్థ సలహాలు, సూచనలే కారణంగా తెలుస్తోంది. ఏ సమయంలో ఏ ఎరువు వాడాలి, సూక్ష్మధాతు లోపాలు కలిగిన పొలాల్లో జింక్, బోరాన్ ఏ స్థాయిలో వాడాలనే విషయాలతో పాటు నత్రజని శాతాన్ని ఏ పంట పొలంలో ఎక్కువగా వాడాలనే విషయంపై రైతు భరోసా కేంద్రాల ద్వారా సూచించడంతో మంచి దిగుబడులు లభించనున్నట్లు రైతులు తెలిపారు.



కాయలు కాస్తున్న జామ తోట

## ప్రశాంత జీవితాన్ని పెంపొందించనున్న ధ్యానం



ధ్యానంపై శిక్షణ ఇస్తున్న బాలయ్య

**చీమకుర్తి:** క్రమం తప్పకుండా ధ్యానం చేయడం వలన ప్రశాంతమైన జీవితాన్ని పొందవచ్చని ధ్యానంపై శిక్షణ ఇస్తున్న ఎస్.బాలయ్య తెలిపారు. సంతనూతలపాడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు స్థానికులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ధ్యానం చేయడం వలన మనిషి హృదయం, మెదడు, శరీర భాగాలపై ఒత్తిడి తగ్గి ఆయురారోగ్యాలు మెరుగుపడతాయన్నారు. ప్రస్తుత రోజుల్లో పనుల ఒత్తిడి ఎక్కువగా ఉండటం వలన దాని ప్రభావం ఆరోగ్యంపై పడుతుందని, ఆరోగ్యం త్వరగా దెబ్బతిని ప్రాణాంతకంగా మారుతుందని అన్నారు. రోజువారీ ఎన్ని పనులున్నా ఒక్క గంట సమయాన్ని తమ జీవితం కోసం కేటాయించుకోవడం వలన రోజంతా చేసిన పని ఒత్తిడి తగ్గి మిగిలిన సమయం ఉత్సాహంగా పనిచేసేందుకు ధ్యానం తోడ్పడుతుందని అన్నారు.

## అమరజీవి అభిమాన సంఘం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న పొట్టి శ్రీరాములు అభిమాన సంఘం నాయకులు

**ఒంగోలు టౌన్:** అమరజీవి పొట్టి శ్రీరాములు అభిమాన సంఘం అధ్యక్షునిగా పేరకం నాగాంజనేయులు, కార్యదర్శిగా సుబ్బారావును ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలులోని ఆర్యవైశ్య భవన్లో ఈ ఎన్నిక జరిగింది. కోశాధికారిగా శిఘాకొల్లి నారాయణ, ఉపాధ్యక్షులుగా గుడిపూడి నరసింహారావు, ఇ.హేమంత్‌కుమార్, సహాయ కార్యదర్శిగా జి.వీరాంజనేయులు ఎన్నికయ్యారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన పల్లపోతు సుబ్బారావు, మోటుపోతుల మధుసూదన్, తాళ్లూరి విజయకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. పొట్టి శ్రీరాములు ఆశయ సాధన కోసం కలిసికట్టుగా కృషి చేస్తామని నూతన కమిటీ పేర్కొంది. దేశం కోసం అమరజీవి చేసిన త్యాగాన్ని, ఆయన జీవిత చరిత్రను ప్రచారం చేస్తామని నాగాంజనేయులు చెప్పారు. ముఖ్య అతిథులుగా ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘ నాయకులు జలదంకి వెంకట కృష్ణారావు, ములుగూరు నాగేశ్వరరావు, పల్లపోతు వెంకటేశ్వరరావు, నేరెళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. నూతన కమిటీని పలువురు ఆర్యవైశ్య నాయకులు అభినందించారు.

## ఘనంగా యూనియన్ వ్యవస్థాపక దినోత్సవం

- యూనియన్ జెండా ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

**ఒంగోలు సబర్బన్:** ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్-1104 వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రామ్‌నగర్‌లోని విద్యుత్ భవన్ ముందు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరెడ్డి యూనియన్ జెండా ఆవిష్కరించారు. యూనియన్ శిలాఫలకం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ 1104 యూనియన్ ఏర్పడి 73 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. 73 సంవత్సరాలుగా ఉద్యోగుల కోసం నిరంతర పోరాటం చేస్తున్నామని వెల్లడించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి రాచగొర్ల సంజీవ్‌రావు మాట్లాడుతూ యాజమాన్యాలు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేయాలన్నారు. విద్యుత్ సంస్థల అభివృద్ధికి యూనియన్ నాయకులు, సిబ్బంది, సభ్యులు అవిరళ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మోహనరావు నాయక్, సీహెచ్ హరికృష్ణ, మనీష్‌బాబు, రవిశంకర్, కాంతారావు, శివప్రసాదు, ఏవీ ప్రతాప్, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి దగ్ధం

**చీరాల అర్బన్:** విద్యుత్ తీగలు తగలడంతో ట్రాక్టర్‌పై ఉన్న వరిగడ్డి దగ్ధమైన ఘటన ఆదివారం సంపత్‌నగర్ వద్ద చోటుచేసుకుంది. సుమారు మూడు ఎకరాల వరిగడ్డిని ఆదివారం తీసుకెళ్తుండగా సంపత్‌నగర్ కాలనీ వద్ద విద్యుత్ తీగలు గడ్డికి తగలడంతో నిప్పురవ్వలు చెలరేగి మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో రూ.25 వేలు నష్టం వాటిల్లగా వివరాలు నమోదు చేసుకున్నారు.

## ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

**మార్టూరు:** జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓవ్యక్తి గాయపడిన ఘటన ఆదివారం సాయంత్రం మార్టూరులో చోటు చేసుకుంది. 108 సిబ్బంది నాగేశ్వరమ్మ వివరాల మేరకు.. జే పంగులూరు మండలం బైటమంజులూరు గ్రామానికి చెందిన తాతపూడి రవికుమార్ చిలకలూరి పేట నుండి స్వగ్రామం వెళుతున్న సమయంలో స్థానికం ఇంటూరి ఫంక్షన్ హాలు ఎదురు రహదారిపై బైకు చైను తెగి వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడి రవికుమార్ గాయపడ్డాడు. తలకు గాయమైన రవికుమార్‌ను 108 సిబ్బంది స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

## 18న బ్రహ్మకుండం వద్ద అభిషేకాలు

**బల్లికురవ:** మహాశివరాత్రి సందర్భంగా కొణిదెన బ్రహ్మకుండం వద్ద నాగలింగేశ్వర స్వామికి అభిషేకాలు, శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభిషేకాల తరువాత శివపార్వతుల కళ్యాణం, రాత్రికి జాగరణ, చేపట్టనున్నట్లు చెప్పారు. ఎంతో చరిత్ర కలిగిన బ్రహ్మకుండం వద్ద వెలసిన నాగలింగేశ్వరుని దర్శించుకుని వేడుకల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరారు.

## 40 శాతం రాయితీపై యాంత్రీకరణ యూనిట్లు

**బల్లికురవ:** రైతుల గ్రూపులకు నలభై శాతం రాయితీపై యాంత్రీకరణ యూనిట్లు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కుమారి ఆదివారం తెలిపారు. ఒక్కో గ్రూపునకు రూ.15 లక్షల వరకు పరికరాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఇందులో రైతు వాటాగా 10 శాతం చెల్లిస్తే, 40 శాతం రాయితీ, 50 శాతం బ్యాంక్ లోన్‌తో దఫాల వారీగా చెల్లించవచ్చని చెప్పారు. మండలంలోని 20 ఆర్బీకేల్లో 13 ఆర్బీకేల పరిధిలో యాంత్రీకరణ యూనిట్లను ఇప్పటికే అందించామన్నారు. బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొణిదెన, అంబడిపూడి, వైదన, కొప్పరపాడు, వెలమవారిపాలెం గ్రామాల్లోని రైతు గ్రూపులు యాంత్రీకరణ యూనిట్లకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## సమస్యల పరిష్కారం కోసం పోరాటం

**అద్దంకి:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామని యూటీఎఫ్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. స్థానిక శ్రీనివాసా కళ్యాణమండపంలో ఆదివారం బాపట్ల జిల్లా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించి వందనం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఏ శ్రీనివాసరావు, పీ హరిబాబు, ఆడిట్ కమిటీ కన్వీనర్ బాబూరావు, అద్దంకి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఈ రామారావు, బీ పూర్ణచంద్రరావు, నాయకులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ మండల నూతన కమిటీ ఏకగ్రీవం



ప్రధాన కార్యదర్శి హనుమంతరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**కొత్తపట్నం:** యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని ఉపాధ్యాయులు ఒంగోలులోని యూటీఎఫ్ భవనంలో ఆదివారం సమావేశమయ్యారు. యూటీఎఫ్ మండల అధ్యక్షునిగా కొత్తపట్నం హైస్కూల్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఎం.సుధాకర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా రాజుపాలెం ఎంపీయూపీ స్కూల్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కొప్పోలు హనుమంతరావు, మహిళా కార్యదర్శిగా ఎం శ్యామ్‌సంజాని, మహిళా కమిటీ కన్వీనర్‌గా కె.పద్మశ్రీ, కో-కన్వీనర్‌గా పి.భారతీదేవి, ఆడిట్ కమిటీ సభ్యులుగా ఎస్.బ్రహ్మయ్య, కె.శ్రీనివాసరావు, సాంస్కృతిక కమిటీ సభ్యులుగా ఎం.జ్యోతి, జీఎస్ శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. మహిళా కౌన్సిలర్‌గా కె.పద్మ, కౌన్సిలర్లుగా బీవీ ప్రభాకర్‌రెడ్డి, టి.వెంకటేశ్వర్లు, ఎస్‌వీ కొండారెడ్డి, పి.రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శులుగా మరో 8 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొప్పోలు హనుమంతరావు మాట్లాడుతూ నూతన కమిటీ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఉపాధ్యాయులకు సేవ చేసే విధంగా కమిటీ వ్యవహరించాలని కోరారు. ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయాలు, ప్రధాన సమస్యలపై పోరాటానికి అందరూ ఐక్యంగా రావాలని పిలుపునిచ్చారు.

## గుంతలు పూడ్చిన జియో కంపెనీ ప్రతినిధులు



జియో సిబ్బంది తవ్విన గుంతలను పూడ్చిన దృశ్యం



కేబుల్ కోసం తవ్విన కాలువను పూడ్చిన దృశ్యం

**ఒంగోలు సబర్బన్:** నగరంలో జియో 5జీ కేబుల్ కోసం తీసిన గుంతలను పూడ్చకుండా వదిలేయడంపై ఆ కంపెనీ ప్రతినిధులు స్పందించారు. నగరంలో ఎక్కడపడితే అక్కడ గుంతలు తవ్వి పూడ్చకుండా వదిలేయడంతో ప్రజల ఫిర్యాదు మేరకు కమిషనర్ వెంకటేశ్వరరావు జియో కంపెనీ ప్రతినిధులను పిలిపించి గత శుక్రవారం మాట్లాడారు. గుంతలు పూడ్చకుంటే కేసు పెట్టమని కార్పొరేషన్ అధికారులకు సూచించారు. దీంతో రెండు రోజులుగా ఆయా గుంతలను కంపెనీ వారు పూడ్చుకుంటూ పోతున్నారు. నగరంలో జియో 5జీ సేవలు అందించేందుకు కేబుల్ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే, ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి తవ్విన గుంతలను పూడ్చకుండా వదిలేస్తుండటంతో ప్రజలు, విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. దీనిపై ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు శుక్రవారం జియో కంపెనీ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీంతో స్పందించిన జియో 5జీ ప్రతినిధులు నగరంలో పనులు పూర్తయిన చోట తీసిన గుంతలను, కేబుల్ కోసం తవ్విన కాలువలను పూడ్చారు.

## ఏసుక్రీస్తు జననం లోకానికి రక్షణ



దైవ సందేశం ఇస్తున్న రెవరెండ్ ఫాదర్ థామస్



విద్యుత్ దీపాల కాంతిలో లూర్దుమాత దేవాలయం

**కారంచేడు:** లోకరక్షణకే ప్రభువైన ఏసుక్రీస్తు లోకంలో కన్య గర్భమున జన్మించారని రెవరెండ్ ఫాదర్ పూదోటి థామస్ అన్నారు. మండల కేంద్రమైన కారంచేడు అంబేడ్కర్ కాలనీ సమీపంలో నెలవైన లూర్దుమాత దేవాలయ ఉత్సవ తిరునాళ్ల ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 9వ తేదీ నుంచి విజయవాడ గుణదల మేరీమాత ఉత్సవాల మాదిరిగానే ఈ ప్రాంతంలో కారంచేడులో మరియమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకములు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలోనే కారంచేడులో నిర్వహించిన ఈ ఉత్సవ తిరునాళ్లకు ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన అనేక మంది చర్చిల ఫాదర్లు ప్రార్థనలకు హాజరై దైవ సందేశాన్ని ఇస్తుంటారు. శనివారం అర్ధరాత్రి వరకు జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు ముఖ్య అతిథిగా హాజరైన రెవరెండ్‌ఫాదర్ థామస్ క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు, సహపంక్తి భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ అనిల్ బోస్కొ, ఫాదర్లు మిఖాయిల్, రాజు, కరుణాకర్, ఏసురత్నం, ఇన్నసారి, మేఘ, కొనకశేఖర్, మనోజ్, భక్తులు పాల్గొన్నారు.

# కొత్త రోడ్డు పూర్తయింది..!



ఒంగోలు-దశరాజుపల్లె రోడ్డు నిర్మిస్తున్న సిబ్బంది



నిర్మాణం పూర్తి చేసుకున్న రోడ్డు

- దశరాజుపల్లె-ఒంగోలు రోడ్డు నిర్మాణం పూర్తి
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని కృషితో ప్రజలకు తీరిన కష్టాలు

**ఒంగోలు రూరల్:** మండలంలోని ఒంగోలు-దశరాజుపల్లె గ్రామ ప్రధాన రోడ్డు నిర్మాణం పూర్తయింది. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కొన్నేళ్లుగా ఈ రోడ్డు నిర్మాణానికి నోచుకోక ప్రజలు ఇబ్బందిపడ్డారు. అడుగు లోతు గుంతలతో ప్రయాణం చేసి ప్రమాదాలకు గురయ్యారు. ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండు నుంచి దశరాజుపల్లె గ్రామానికి ఆటోలో వెళ్లాలంటే కేవలం 4 కిలోమీటర్ల దూరానికే రూ.300 చెల్లించాల్సిన పరిస్థితి ఉండేది. ఈ రోడ్డులో వెళ్లేందుకు మోటారు సైకిళ్లుగానీ, ఆటోలుగానీ సాహసం చేసేవికావు. లింక్ గ్రామాలు లేకపోవడంతో ఆర్టీసీ బస్ సౌకర్యం లేదు. ఫలితంగా గ్రామం నుంచి ఒంగోలు వచ్చి పనులు చేసుకునే వారు కాలి నడకనే నగరానికి చేరుకునేవారు.

**ఎమ్మెల్యే బాలినేని కృషితో నిధులు విడుదల...**

దశరాజుపల్లె వాసుల రోడ్డు కష్టాలను వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టికి ఆ పార్టీ స్థానిక నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీలక్ష్మి, ప్రజలు తీసుకెళ్లగా, వెంటనే స్పందించారు. రోడ్డు పరిస్థితిని పరిశీలించిన బాలినేని.. మొదటి దశలో రూ.45 లక్షల నిధులు విడుదల చేయించి 2 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. గత సంవత్సరం ఆగస్టులో బాలినేని శంకుస్థాపన చేసిన అనంతరం టెండర్లు పిలిచారు. అనంతరం పలుమార్లు భారీ వర్షాలతో తారురోడ్డు నిర్మాణానికి అంతరాయం కలిగింది. గత సంవత్సరం నవంబరులో ప్రారంభమైన రోడ్డు నిర్మాణంలో తొలుత మెటల్ వర్క్, రోలింగ్, లెవలింగ్ కార్యక్రమాలు వేగంగా పూర్తయ్యాయి. మార్జిన్ నిర్మాణాలు పూర్తిచేసిన అనంతరం 2 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణాన్ని మొదటి దశలో పూర్తి చేయడంతో గ్రామానికి రోడ్డు ఏర్పడింది. అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించడంతో ఎలాంటి లోపాలు లేకుండా వేగంగా, నాణ్యంగా తారురోడ్డు నిర్మాణం జరిగింది. డీఈ వేణుగోపాల్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించడంతో దశరాజుపల్లెకు మొదటి దశలో సింగిల్ రోడ్డు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. మార్జిన్‌లో ఎర్ర మట్టి తోలకం, మలుపుల వద్ద సూచక బోర్డుల పనులను సోమవారం నుంచి ప్రారంభించి వెంటనే పూర్తి చేస్తామని ఇంజినీరింగ్ విభాగం అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి తారురోడ్డు నిర్మాణానికి రూ.41.50 లక్షలు ఖర్చయిందని వెల్లడించారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు రెండో దశ పనులను కూడా వెంటనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. రూ.81 లక్షలతో 3 కిలోమీటర్ల దూరం తారురోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్లు సర్పంచ్ శ్రీలక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. రోడ్డు నిర్మాణం వేగంగా పూర్తయి అందుబాటులోకి రావడంతో దశరాజుపల్లె గ్రామస్తులు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి, సర్పంచ్ శ్రీలక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డికి, అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నారు.